క్లుప్తంగా

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ఆరణి

చిత్తూరు రూరల్: నగరంలోని సంతపేట మసీదులో ఆదివారం రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. తొలుత ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తర్వాత ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందు చేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు, కార్పొరేటర్ జ్ఞానజగదీష్, నాయకులు పాల్గొన్నారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు రూరల్: నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కిరణ్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే స్పందనకు ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని ఆయన చెప్పారు.

వన సంరక్షణ సమితికి విరాళం



చెక్కును అందజేస్తున్న గౌహతి సుబ్బారెడ్డి

పూతలపట్టు: మండలం అనంతాపురం గ్రామంలో సుబ్బారెడ్డి వన సంరక్షణ సమితి ఆట స్థల అభివృద్ధి పనుల కోసం ఆదివారం ఈశ్వర్ స్టోన్స్ యాజమాన్యం గౌహతి సుబ్బారెడ్డి చేతుల మీదుగా గ్రామస్తులకు రూ. 51 వేలు విరాళంగా అందజేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలోని యువకుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని బయటకు తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకూరు జీవరత్నం రెడ్డి, గుణేష్ రెడ్డి, బి.పురుషోత్తమ నాయుడు, ఏ.పురుషోత్తమ నాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ అరుణ తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి స్పందన ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని 50 డివిజన్లలో ఉన్న వార్డు సచివాలయాల్లో మధ్యాహ్నం 3–5 గంటల మధ్యలో ప్రజలు వినతులు అందచేయవచ్చని చెప్పారు. ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ 08572232745, వాట్సాప్ 9849907885 నంబరుకు సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

ప్రతి గ్రామంలో అంబేడ్కర్ జయంతి

చిత్తూరు కలెక్టరేట్: ప్రతి గ్రామంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించడానికి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వినాయకం అన్నారు. నగరంలోని జానకారపల్లి పాఠశాలల్లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి రోజున సన్మాన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రతి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు వారంలో ఒక రోజు పల్లెకు వెళ్లి అక్కడ ఉన్నటువంటి ఎస్సీ,ఎస్టీల కుటుంబాలను సందర్శించి వారి పరిస్థితులను తెలుసుకోవాలని చెప్పారు.

గిరిజనులకు ఇంటి పట్టాలు పంపిణీ



పట్టాలను అందిస్తున్న పార్టీ నాయకులు

వరదయ్యపాళ్యం: మండలంలోని గూడాలవారి పాళ్యం పంచాయతీ పరిధిలోని చెంచురామశెట్టి కాలనీకి చెందిన గిరిజనులకు స్థానిక సర్పంచ్ చంద్రారెడ్డి చొరవతో ఇంటి స్థలాల పట్టాలను మంజూరు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇంటి స్థలాల్లేక అవస్థలు పడుతున్న గిరిజనుల సమస్యలపై చంద్రారెడ్డి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణం గిరిజనులకు ఇంటి స్థలాలను మంజూరు చేయాలని మండల రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. దీనికిపై స్పందించిన తహసీల్దార్ గౌరీశంకర్ రావు క్షేత్ర స్థాయిలో లబ్ధిదారుల వివరాలను పరిశీలించి 13 మందికి ఇంటి స్థలాలను కేటాయించి పట్టాలను జారీ చేశారు. సంబంధిత పట్టాలను ఆదివారం మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి చేతుల మీదుగా సర్పంచ్ చంద్రారెడ్డి పంపిణీ చేశారు. గిరిజనుల సమస్యలపై స్పందించి పట్టాలను మంజూరు చేయించిన స్థానిక ఎమ్మెల్యేకు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని, అండగా నిలుస్తామని గిరిజనులు పేర్కొన్నారు.

‘చల్లని’ ఆరోగ్యం



- పోషకాలు మెండు
- ఆరోగ్యంతో పాటు వేసవితాపం నుంచి ఉపశమనం
- కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న జనం
- జోరుగా విక్రయాలు

గుడిపాల: పుచ్చకాయ ఆరోగ్యానికి చాలా మంచిది. ఇది శరీరంలో వేడిని తగ్గించడంతో పాటు ఎంతో మేలు చేస్తుంది. వేసవితాపం, దాహాన్ని తీర్చేందుకు అద్భుతమైన ఫలం పుచ్చకాయ. వేసవిలో మన శరీరంలో నీటి స్థాయిలు తగ్గిపోతుంటాయి. తద్వారా డీహైడ్రేషన్, వడదెబ్బకు గురై కళ్లు తిరిగి కింద పడిపోతుంటారు. ఈ పరిస్థితి ఒక్కోసారి ప్రాణాలకే ప్రమాదం. అందుకే మన శరీరంలో వాటర్ లెవల్స్, షుగర్ లెవల్స్ తగ్గిపోకుండా ఉండేందుకు పుచ్చకాయ ముక్కలు తినడం బెస్ట్ ఆప్షన్ అని అంటున్నారు వైద్యులు. పుచ్చకాయలో ఉండే విటమిన్లు, పోషకాలు, వ్యాధి నిరోధక శక్తిని పెంచే యాంటీ ఆక్సిడెంట్లు, బి విటమిన్, క్యాల్షియం, సోడియం, మెగ్నీషియం, పొటాషియం, క్లోరిన్, జిటాకెరోటిన్లు, ఆల్కలైన్, విటమిన్–ఎ, విటమిన్ బి–6, విటమిన్–సి, సుక్రోజ్, ఫ్రక్టోజ్, గ్లూకోజ్, ఎలక్ట్రోలైట్లు... ఎండాకాలంలో మన శరీరానికి కావాల్సిన పోషకాలను అందిస్తాయంటున్నారు.

షుగర్‌బేబి, ఆర్కిమెన్ రకాలకు డిమాండ్

రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి శరీరానికి ఉపశమనం కల్పించి, ఆరోగ్యం అందిపుచ్చుకునేందుకు చాలామంది పుచ్చకాయలను కొనుగోలు చేస్తున్నారు. చిన్నారుల దగ్గర నుంచి వృద్ధుల వరకు వీటిని ఎంతో ఇష్టంగా తింటున్నారు. దీంతో పుచ్చకాయల అమ్మకాలు జోరందుకున్నాయి. ఎక్కడికక్కడ వెలసిన స్టాల్స్, దుకాణాల్లో విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి. మధురఫలం, షుగర్‌బేబీ, ఆర్కిమెన్ వంటి రకాలకు మంచి గిరాకీ ఉందని వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్‌లో కిలో పుచ్చకాయ రూ.20 నుంచి రూ.25 పలుకుతుండగా, పుచ్చకాయ ముక్క రూ.10 పలుకుతుంది. 100 గ్రాముల పుచ్చకాయలో 91.45 గ్రాముల నీరు, 6శాతం చక్కెర, 90 కేలరీల శక్తి, 7.6 గ్రాముల పిండి పదార్థాలు, 0.6 శాతం మాంసపుకృత్తులు ఉంటాయి. వీటితోపాటు 12 గ్రాముల పొటాషియం, 7 గ్రాముల కాల్షియం, ఓ మిల్లీ గ్రాము సోడియం ఉంటాయి.

పుచ్చకాయ ప్రయోజనాలు

- వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.
- మలబద్ధకం రాకుండా చేస్తుంది.
- వృద్ధాప్యంలో అంధత్వం నివారిస్తుంది.
- రక్త ప్రసరణ సక్రమంగా అవుతుంది.
- వేసవితాపం నుంచి ఉపశమనం కలిగిస్తుంది.
- తక్షణ శక్తిని ఇస్తుంది.

శరీరానికి ఆరోగ్యం



పుచ్చకాయ శరీరానికి ఆరోగ్యం కలిగిస్తుంది. వయసుతో సంబంధం లేకుండా అందరూ దీనిని తినొచ్చు. వేసవిలో ఇది తింటే వేసవితాపం నుంచి రక్షణ పొందవచ్చు. వీలు దొరికినప్పుడల్లా పండ్ల రూపంలో గానీ జ్యూస్ రూపంలో గానీ తీసుకోవచ్చు.

–సుకన్య, వైద్యాధికారి, గుడిపాల

సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

- గడపగడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక సమస్యలన్నింటినీ పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక 28వ డివిజన్ వినాయకపురంలో ఆదివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడారు. డివిజన్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పింఛన్, రేషన్‌కార్డు, నీటి సమస్య ఉందని, నూతన కాలువలు నిర్మించాలని, పలు ప్రాంతాల్లో శానిటేషన్ పనులు చేయించాలని స్థానికులు విన్నవించారు. నీటి ఎద్దడి నివారణకు నూతనంగా పైపులైన్ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీనిచ్చారు. ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం చేపడతామన్నారు. సచివాలయ పరిధిలోని సమస్యలను ఉద్యోగులు నమోదు చేసుకుంటున్నారని చెప్పారు. ప్రతి నెలా గడపగడప సమస్యలపై సంబంధిత అధికారులతో సమీక్షిస్తున్నామన్నారు. మరో మూడు నెలల్లో ప్రతి డివిజన్‌కు రూ.20 లక్షలు మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కేటాయిస్తుందని చెప్పారు. వాటితో కొండమిట్ట ప్రాంతంలోని నీటి సమస్య దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. అర్హత ఉన్నవారికి పింఛన్, రేషన్, ఇంటి స్థలాలు అందే విధంగా చూడాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభావతి, డివిజన్ నాయకులు సంతోష్, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, నాయకులు రాజాతదితరులు పాల్గొన్నారు.

సిపాయి స్త్రీ స్వేచ్ఛకు శ్రీకారం

రేణిగుంట: సిపాయి స్త్రీ స్వేచ్ఛ కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళల సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం అవుతుందని నెల్లూరు జిల్లా న్యాయమూర్తి సి.సత్యవాణి అన్నారు. రేణిగుంట మండలం సూరప్పకశం గ్రామంలో ఆదివారం సిపాయి స్త్రీ స్వేచ్ఛ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్సీ సభ్యులు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పాల్గొన్న ఈ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మహిళల ఆరోగ్యం కోసం వినూత్నమైన పథకాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం చేపట్టడం సంతోషకరమన్నారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ మహిళలలో శుభ్రతపై అవగాహన పెరగాలన్నారు. నెలసరి సమయంలో శుభ్రత నియమాలను పాటించకపోవడం వల్ల ఏటా లక్షలాది మంది మహిళలు గర్భాశయ క్యాన్సర్‌కు గురవతున్నారని తెలిపారు. దీంతో తాను నియోజకవర్గంలో ఏడాదికి సరిపడా మహిళలకు 30లక్షల శానిటరీ ప్యాడ్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే బాలింతలు, గర్భిణులకు ఎండు ద్రాక్ష, ఆరు కిలోల ఖర్జూరం, ఉసిరి, హార్లిక్స్ కిట్లను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ వినూత్న కార్యక్రమం ద్వారా పేద గ్రామీణ మహిళల ఆరోగ్య సంరక్షణ సాధ్యం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం మహిళలకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సుధ, లక్ష్మీపతిరెడ్డి, చంద్రారెడ్డి, వన్నెరెడ్డి సేవాసంఘం అధ్యక్షుడు సురేష్‌బాబు, తిరుమలరెడ్డి, గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



36 ఏళ్ల తర్వాత ఒక చోట కలిసిన బీజెడ్ పాఠశాల పూర్వ విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని బీజెడ్ హైస్కూల్లో 36 ఏళ్ల కిందట వారంతా కలిసి చదివారు. తరువాత ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో పూర్వ విద్యార్థులంతా ఒక చోట చేరారు. నగరంలోని బీజెడ్ హైస్కూల్లో 1986–17లో పదవ తరగతి డి సెక్షన్‌లో చదివిన విద్యార్థులు చాలా ఏళ్ల తర్వాత కలిశారు. ఆనాటి మధుర స్మృతులను, చిలిపి తగాదాలను మననం చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు కృష్ణకుమార్, రమేష్‌బాబు, మురళి మోహన్ తదితరులు మాట్లాడుతూ చాలా ఏళ్ల తరువాత మిత్రులందరం ఒక చోట చేరడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో డిల్లెమ్మ, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో గల్లా అరుణకుమారి

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం ఆమె స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, మాజీ ఆలయ చైర్మన్ జగన్నాథ రెడ్డి, మణి నాయడు, నాయకులు పుణ్యసముద్రం రవి, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికీ ‘జగనన్నే మా భవిష్యత్’







పూతలపట్టు: కరపత్రం అందజేస్తున్న నాయకులు, చిత్తూరు: క్యాలెండర్ పంచుతున్న జెడ్పీటీసీ, బంగారుపాళెం: కరపత్రాల పంపిణీలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పూతలపట్టు: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని చేపట్టారు. నాయకులు పెద్ద ఎత్తున ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తున్నారు. మండలంలోని ఎల్లంపల్లి, బత్తలవారి పల్లి, మిట్టపాలెంలోని గ్రామస్తులకు వ్యాపారవేత్త జగదీశ్వర్ రెడ్డి కరపత్రం అందజేశారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధి గురించి వివరించారు. అనంతరం మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్ రెడ్డి పోలవరం పంచాయతీలోని గ్రామాల్లో కరపత్రం అందజేస్తారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాసిలమణి, ఎంపీటీసీ షణ్ముగం, సర్పంచ్ నిరంజన్ రెడ్డి, నాయకులు ల్గొన్నారు.

అనంతాపురంలో ..

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం అనంతాపురంలో ఆదివారం రాత్రి మా నమ్మకం..నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబునాయుడు ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు.



గుడిపాల: పానాటూరులో కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

జగనన్న చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను గుర్తించాలని గడపగడపలో పేర్కొన్నారు. కార్యక్రమంలో రంజన్, భాస్కర్, పట్టాభి, రాజేంద్ర, ఆనంద్, ఇళయరాజా తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగనన్నతోనే..

బంగారుపాళెం: జగనన్నతోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, జెడ్పీటీసీ సోమశేఖర్ అన్నారు. బంగారుపాళెం దళితవాడలో ఆదివారం ×మా నమ్మకం నువ్వే జగన్‌ె కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు బాగున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఉషా, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయ్

గుడిపాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే రాబోయే ఎన్నికల్లో విజయం చేకూరుస్తాయని సచివాలయ మండల కన్వీనర్ సాయి అన్నారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రతి కుటుంబానికీ తెలియ చెప్పాలని వలంటీర్లు, గృహసారథులకు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలను సహనంతో వివరించాలని చెప్పారు.

కిడ్నీ బాధితురాలికి రూ.10 వేలు ఆర్థికసాయం

చిత్తూరు రూరల్: కిడ్నీ బాధితురాలికి దాత పార్థసారథినాయుడు ఆదివారం రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. పెనుమూరు మండలం శెట్టిగారిపల్లెకు చెందిన నీరజకు రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి. భర్త విజయకుమార్ దివ్యాంగుడు కావడంతో ఈమెకు కుటుంబ పోషణ భారంగా మారింది. మరోవైపు కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. ఈ తరుణంలో కిడ్నీ చికిత్సకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం తెలుసుకున్న దాత పార్థసారథి నాయుడు రూ. 10 వేలు ఆర్థికసాయం అందించారు. దయగల దాతలు బాధితురాలిని ఆదుకోవాలని పిలుపునిచ్చారు.

కానరాని కాడెద్దులు.. దున్నేస్తున్న ట్రాక్టర్లు

గుడిపాల: వ్యవసాయంలో కొన్ని శతాబ్దాల పాటు పాడి–పంట అనుబంధంగా సాగాయి. రైతన్నలకు ఎల్లప్పుడూ వెన్నుదన్నుగా నిలిచేది పశుసంపద. ఆరుగాలం సేద్యం పనుల్లో వెన్నంటి ఉంటూ అన్నదాతకు తోడుగా ఉండేవి పశువులు. గతంలో ప్రతి రైతు ఇంటా దేశవాళీ, సంకరజాతి ఆవులు తప్పనిసరిగా ఉండేవి. అయితే కాలక్రమేణా చోటుచేసుకున్న మార్పులతో పరిస్థితులు తారుమారయ్యాయి. పల్లెల్లో ప్రస్తుతం కాడెద్దులు కనుమరుగయ్యాయి. ఆ స్థానంలో ట్రాక్టర్లు వచ్చాయి. దాదాపుగా ఎద్దులు చేసే పనులన్నీ ఇప్పుడు యంత్రాలు చేస్తున్నాయి. దీంతో ఎద్దులకు పని లేకుండా పోయింది. అన్నదాతలకు ఎద్దుల పోషణ భారంగా మారిపోయింది. ఈ క్రమంలోనే కాడెద్దులు పల్లెల్లో కూడా కనిపించకుండా పోతున్నాయి.

గతంలో చిత్తూరు నియోజకవర్గంలో సుమారు 23 వేల వరకు ఎద్దులు ఉండేవి. ప్రస్తుతం ఆ సంఖ్య 6వేలకు చేరింది. సేద్యపు పనులు చేసుకోవడానికి పశువుల స్థానంలో యంత్రాలు రావడంతో అన్నదాతలంతా పశుసంపదను వదులుకోవాల్సిన పరిస్థితి. ఒకప్పుడు గ్రామాల్లో పశువులను పెంచడం పెద్దరికంగా భావించేవారు. ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా తయారయ్యాయి. ప్రతి ఇంట్లోనూ ఎద్దులు, జాతి పశువులు అధికంగా ఉండేవి. ప్రస్తుతం కొంతమంది మాత్రమే పాలకోసం పెంచుకుంటున్నారు.



పొలం దుక్కి చేస్తున్న ట్రాక్టర్

వ్యవసాయంపై ప్రభావం

తరిగిపోతున్న పశుసంపద వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పశువుల పేడను వ్యవసాయానికి వేస్తే అధిక దిగుబడి వచ్చేది. ఇప్పుడు ఎక్కడా పశువులపేడ, ఎరువులు దొరకని పరిస్థితి దాపురించింది. రోవైపు సేద్యం కోసం ఎవరైనా ఎద్దులను వినియోగించాలనుకున్నా, దొరకడం లేదు. దీంతో తప్పనిసరిగా రైతులంతా ట్రాక్టర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రపంచీకరణ నేపథ్యంలో ఆధునిక వ్యవసాయ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. యంత్రాలు పని త్వరగా పూర్తి చేయడంతో రైతులకు సమయం ఆదా అవుతోంది. దీంతో అందరూ వీటివైపూ మొగ్గు చూపుతున్నారు. క్రమంగా కాడెద్దులు కానరాకుండా పోతున్నాయి.

పునరుత్థానం.. ఆనందపరవశం!

- భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు
- క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు
- చర్చిలకు తరలివచ్చిన క్రైస్తవులు

చిత్తూరు రూరల్: ఏసుక్రీస్తు పునరుత్థానుడైన సందర్భంగా ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఆదివారం చిత్తూరులోని క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా చర్చిల్లో వేడుకలు అంబరాన్నంటాయి. చిత్తూరులోని టౌన్‌చర్చి, రీడ్స్‌పేట చర్చి, బీటీ మెమోరియల్ చర్చి, తెలుగు లూక్స్ చర్చి, జాన్‌బాస్కో చర్చి, హోసాన్నా మందిరాల్లో క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. సూర్యోదయ ఆరాధనతో ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. గుడ్ ఫ్రైడే నాడు సిలువలో బందీఅయి చనిపోయిన క్రీస్తు తిరిగి లేచి తాను చెప్పిన మాటను నిలబెట్టుకున్నాడని, దీన్నే విశ్వాస పండుగ అని చెబుతుంటారు. ఈ సందర్భంగా చర్చిల్లో పాస్టర్లు దైవ సందేశం వినిపించారు. ఈస్టర్ అంటే విశ్వాసం, నమ్మకం అని చనిపోవడానికి ముందు క్రీస్తు తాను తిరిగిలేస్తానని చెబుతాడని, ఆమాట నిజమైతే పునరుత్థానం ఉంటుందని ఈస్టర్ నాడు యేసుక్రీస్తు తిరిగి లేచాడు కాబట్టి పునరుత్థానం ఉంటుందని పాస్టర్లు పేర్కొన్నారు. ఏటా గుడ్‌ఫ్రైడే, ఈస్టర్ పండుగలు వస్తుంటాయని, పండుగ వచ్చిన ప్రతిసారి ఒక కొత్త నిర్ణయంతో జీవితంలో ముందుకు సాగాలని కోరారు. సాయంత్రం యేసుక్రీస్తును స్మరిస్తూ క్రీస్తుజన్మ ఇతివృత్తంపై క్రైస్తవులు నాటక ప్రదర్శన చేశారు. ఈ ప్రదర్శన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

వేడుకల్లో విజయానందరెడ్డి...

చిత్తూరు నగరంలోని టౌన్‌చర్చి, చామంతిపురం చర్చిల్లో జరిగిన ఈస్టర్ వేడుకల్లో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి పాల్గొన్నారు. కాసేపు చర్చిల్లో శాంతి సందేశాన్ని విన్నారు. అనంతరం ప్రబోధకులు రాజకీయ భవిష్యత్ బాగుండాలని ఆయన కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి సభ్యులు ఘనంగా సన్మానించారు. క్రైస్తవులకు దుస్తులు పంపిణీచేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ డాల్విన్ క్రిష్టియన్‌దాస్, పాస్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మరణాన్ని గెలిచిన మహనీయుడు ఏసుక్రీస్తు

పూతలపట్టు: మరణాన్ని గెలిచిన మహనీయుడు ఏసుక్రీస్తు అని లివింగ్ వర్డ్ కేత డ్రన్ చర్చ్ మోడవేటర్ బిషప్ పిడి భాస్కర్ అన్నారు. ఏసుక్రీస్తు ఈస్టర్ ఆరాధన కార్యక్రమం మండలంలోని నాగిరెడ్డిపల్లి చర్చిలో ఆదివారం నిర్వహించారు. చర్చిలో ఆరాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బిషప్ పిడి భాస్కర్ మాట్లాడుతూ ప్రభువైన ఏసుక్రీస్తు మరణాన్ని జయించి మూడో రోజు తిరిగి లేచిన సందర్భాన్ని ఆయన వివరించారు. ఏసుక్రీస్తు మరణాన్ని జయించిన మహనీయుడని ఆయన పునరుత్థాన శక్తిని కలిగిన దేవుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేవ. సతీష్ బాబు సంగతులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

గుడిపాల: మండలంలోని పలు చర్చిల్లో ఆదివారం ఈస్టర్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. చర్చిలను సుందరంగా అలంకరించారు. పాస్టర్‌లు మాట్లాడుతూ గుడ్‌ఫ్రైడే నాడు శిలువపై మరణించిన యేసు మూడో దినం ఆదివారం మరణాన్ని జయించి మృత్యుంజయుడిగా వచ్చిన రోజు కావడంతో ఈస్టర్ పండుగని క్రైస్తవులు జరుపుకొంటారని తెలిపారు. అనంతరం చర్చిల్లో కేక్‌లను కట్టిచేసి క్రైస్తవులకు పంచి పెట్టారు. ఆటలపోటీలని నిర్వహించారు.







పూతలపట్టు: ఈస్టర్ వేడుకల్లో క్రైస్తవులు

చిత్తూరు: అన్నదానం చేస్తున్న విజయానందరెడ్డి, గుడిపాల: ముస్తాబైన చలిచీమలపల్లె చర్చి

ప్రమాదాల ‘కనుమ’

కార్వేటినగరం: టిప్పర్ బోల్తా పడిన సంఘటన మేజర్ పంచాయతీ కార్వేటినగరం సమీపంలోని చిన్నకనుమ మలుపు వద్ద శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరం వైపు ముగ్గుపిండి లోడుతో వస్తున్న టిప్పర్ చిన్నకనుమ వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరం వైపుగా వచ్చే టిప్పర్లు ఎక్కువ లోడుతో వస్తుండడంతో చిన్నకనుమ వద్ద డ్రైవర్లు వాహనాన్ని అదుపు చేయలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. వారంలో రెండు, మూడు సార్లు ఇక్కడ వాహన ప్రమాదాలు జరుగుతుంటాయి. నిత్యం వాహన చోదకులు పళ్లిపట్టు, కార్వేటినగరం నుంచి తిరుపతికి ఈ మార్గంలో ప్రయాణం చేస్తుంటారు. అయితే పెద్దకనుమ నుంచి చిన్నకనుమ వరకు రోడ్డు నిటారుగా ఉండడం వల్ల టిప్పర్లు, లారీలు అదుపు తప్పి 15 అడుగుల లోయలోకి బోల్తా పడుతుంటాయని చెబుతున్నారు. వారం కిందట కూడా ఇదే ప్రాంతంలో టిప్పర్ అదుపు తప్పి 33 కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. అయితే డ్రైవర్ స్వల్ప



చిన్నకనుమ వద్ద బోల్తాపడిన టిప్పర్

గాయాలతో బయటపడ్డాడు. గత నెలలో కూడా ఓ టిప్పర్ అదుపు తప్పి పాడి ఆవును ఢీకొనడమే కాకుండా కార్వేటినగరంలోని గాండ్లమిట్ట కూడలి వద్ద నిల్చున్న ఇద్దరు వ్యక్తులను ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందింది. ఓ వ్యక్తిని సుమారు 200 మీటర్ల వరకు లాక్కెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి పెద్దకనుమ, చిన్నకనుమ వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే టిప్పర్ల వెళ్లకుండా నియంత్రించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.